## సిలిండర్ ధర పెంపు.. సామాన్యులపై భారం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ అనురాధాపత్యానాయక్

ఆమనగల్లు, ఏప్రిల్ 8 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధరను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నదని మాజీ జడ్పీటీసీ అనురాధాపత్యానాయక్ విమర్శించారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. దేశంలో అచ్చేదిన్ తీసుకొస్తామని ప్రగ్భలాలు పలికిన కేంద్ర ప్రభుత్వం, వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచి మహిళ తల్లులను మోసం చేస్తున్నదని తెలిపారు. వంట గ్యాస్ ధరను పెంచడంతో పేద, సామాన్య ప్రజలపై భారం పడుతుందని పేర్కొన్నారు. త్వరలో జరిగే తమిళనాడు ఎన్నికల నిధుల సేకరణ కోసమే కేంద్రం గ్యాస్ ధరను పెంచిందని ఆరోపించారు. గతంలో రష్యా నుంచి తక్కువ ధరకు క్రూడాయిల్ లభించిన, ధరలను తగ్గించకుండా కేవలం కార్పోరేట్ సంస్థలకు లాభం చేకూర్చేందుకే వంట గ్యాస్ ధరను పెంచారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే వంట గ్యాస్ ధరను తగ్గించి సామాన్య ప్రజలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్‌రావు, మాజీ ఎంపీటీసీ సరితాపంతూనాయక్, మాజీ సర్పంచ్ సోనూశ్రీనునాయక్, నాయకులు ఖలీల్, బాలస్వామి, రమేశ్, సాయిలు, శంకర్, రమేశ్‌నాయక్, శివకుమార్, గణేశ్, పరమేశ్, వెంకటయ్య, శివ, గణేశ్‌నాయక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ విధుల బహిష్కరణ



విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు, ఏప్రిల్ 8 : హైదరాబాద్‌లో న్యాయవాది మహ్మద్ ముజ్తబాఅలీపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్ అన్నారు. న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాదిలాల్ మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో న్యాయవాదిపై దుండగులు విచక్షణా రహితంగా కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి విచారణ జరిపి నిందితులకు శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జగన్, సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్‌కుమార్, క్రీడా సంస్కృతి కార్యదర్శి శేఖర్, కోశాధికారి కృష్ణ, గ్రంథాలయ కార్యదర్శి మల్లేశ్, న్యాయవాదులు, గణేశ్, సంతోశ్, మల్లేశ్, దేవేందర్, శ్రీనివాస్, శిరీషా, సర్దార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉచిత శిక్షణా తరగతులు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 8 : యువత నైపుణ్యాభివృద్ధి కోసం ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని వెల్‌స్పన్ గ్రూప్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సుధీర్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం చేవెళ్లలో వెల్‌స్పన్ ఫౌండేషన్ అధ్వర్యంలో ఉచిత శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 నుంచి ఇంటర్ వరకు విద్యార్హత కలిగి ఉండి 18 ఏండ్లు పైబడిన నిరుద్యోగ యువతకు నాలుగు డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రతినిధులు సురేఖ, సునందాదేవి, విపుల్, శర్మ, రవీంద్ర, ఉపేందర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యను అధిగమించాలి

- ఎంపీడీవో వెంకయ్యగౌడ్
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్య గౌడ్

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 8 : గ్రామాల్లో తాగునీటి సమస్యను అధిగమించాలని ఎంపీడీవో వెంకయ్య గౌడ్ సూచించారు. మంగళవారం శంకర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామాల్లో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీల్లో నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలు సేకరించాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, ప్లాస్టిక్ నిషేధం, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీలకు వసతులు పెంచాలని, తదితర వాటిపై అధికారులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. రాజీవ్ యువ వికాసం స్కీమ్‌కు సంబంధించి ఈ నెల 14వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నదని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు అనంతరం పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలి



యాచారం: మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

యాచారం, ఏప్రిల్ 8 : పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో వినీతాదేవి అన్నారు. మంగళవారం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కార్యాలయంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోషక విలువలు, అదనపు ఆహార విశిష్టత, తల్లిపాల ప్రాముఖ్యత, రక్తహీనత తదితర అంశాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. వివిధ రకాల పోషకాలను ప్రదర్శించారు. పోషక విలువలను పెంపొందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యంగా తల్లులకు 1000రోజుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు తగినంతగా పౌష్టికాహారం అందించాలని ఆమె సూచించారు. ఈ నెల 8నుంచి 22వరకు నిర్వహించనున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఎంపీవో శ్రీలత, వైద్య ఆరోగ్య అధికారులు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులున్నారు.

### చిరు ధాన్యాలు తీసుకోవాలి

**చేవెళ్లటౌన్ :** పోషకాహారం కలిగిన ఉన్న చిరు దాన్యాలను తీసుకోవడంతో అరోగ్యంగా ఉంటారని సీడీపీవో హెప్సిబా తెలిపారు. మంగళవారం చేవెళ్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె చిరు ధాన్యాలు తీసుకుంటే కలిగే ప్రయోజనాలపై వివరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై తెలిపారు. చిన్న పిల్లల ఎదుగుదలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లటౌన్: సమావేశంలో మాట్లాడుతన్న సీడీపీవో హెప్సిబా

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్, ఏప్రిల్ 8 : మండల కేంద్రానికి చెందిన చెంచు మహేశ్వరి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా మంగళవారం మధ్యాహ్నం బీఆర్ఎస్ కడ్తాల్ మండలాధ్యక్షుడు పరమేశ్‌తో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ తరపున వెంకటేశ్‌గుప్తా రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళ్లలా అండగా ఉంటామని ఆయన భరోసానిచ్చారు. పరామర్శించిన వారిలో నర్సింహ, రామచంద్రయ్య, అంజి, మల్లేశ్, వెంకటేశ్, దాసు, సురేశ్, కృష్ణ, రామకృష్ణ, మహేశ్, ప్రశాంత్, కిరణ్, నర్సింహ, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## అధికారులు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయాంజాల్, ఏప్రిల్ 8 : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూరు క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, మెట్రో వాటర్ వర్క్స్, సివిల్ సప్లై, ఆర్ అండ్ బీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి ఎద్దడి నివారణ, బియ్యం పంపిణీ తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పలు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతు చేయించాలి

ఆదిబట్ల, ఏప్రిల్ 8 : ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ శివారులోని పల్లె పకృతి వనంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో పరికరాలకు మరమ్మతు చేయించాలని బహుజన్ సమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర కోశాదికారి బంగారిగళ్ల మహేందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఈ జిమ్‌ను వినియోగించుకుంటున్నారని, పరికరాలకు మరమ్మతు చేయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో దండిగ శ్రీశైలం తదితరులు ఉన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

## మాడ్గులలో మురుగు.. పరుగు



మాడ్గుల, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలో డ్రైనేజీ లేక రోడ్లపై మురుగు పారుతున్నది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు మురుగు పారుతుండడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాడ్గులలో డ్రైనేజీల నిర్మాణ పనులకు రూ.10కోట్లు మంజూరయ్యాయని ప్రచారం చేస్తుకుంటున్నారు తప్ప పనులు ప్రారంభించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## హైటెన్షన్ వైర్ల తొలగింపు



ఆరో వార్డులో జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేస్తున్న హైటెన్షన్ వైర్లు

కొత్తూరు, ఏప్రిల్ 8 : ఎన్నో ఏండ్లుగా ప్రజలు పడుతున్న కష్టాలు తీరనున్నాయి. ఎప్పుడేమి జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్న కాలనీ ప్రజలకు ఉపశమనం లభించింది. కొత్తూరు మున్సిపాలిటీలోని 6వ వార్డులో ఇండ్ల మధ్యలో నుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్ల మళ్లింపు ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ఆరో వార్డు కౌన్సిలర్ హేమా దేవేందర్ విజ్ఞప్తి మేరకు విద్యుత్ అధికారులు హైటెన్షన్ వైర్లను ఇళ్ల మధ్య నుంచి తొలగించి జనవాసాలకు దూరంగా ఉన్న ప్రాంతానికి తరలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కౌన్సిలర్ హేమా దేవేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పడిపోతున్నా.. పట్టించుకోరా!


పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 8: పచ్చదనమే లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలపై పర్యవేక్షణ కొరవడుతున్నది. మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారం-కుంట్లూరు మార్గంలోని కుంట్లూరు పరిధిలో ప్రధాన రహదారికి ఇరువైపులా పదుల సంఖ్యలో మొక్కలు పడిపోయాయి. పలు మొక్కలు పూర్తిగా రోడ్డుపై పడిపోగా.. మరికొన్ని మొక్కలు వంగి కిందపడేందుకు సిద్ధమయ్యాయి. మున్సిపల్ అధికారులు స్పందించి మొక్కలను సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.







## రెండు తులాల బంగారం రికవరీ




బాధితుడికి రెండు తులాల బంగారు బ్రాస్‌లెట్‌ను అందజేస్తున్న సీఐ, ఎస్సై

కేశంపేట, ఏప్రిల్ 8: ఫంక్షన్‌లో తప్పిపోయిన బ్రాస్‌లెట్ ఘటనలో కేసు నమోదు చేసిన పోలీసులు రికవరీ చేసి మంగళవారం బాధితుడికి అందజేశారు. సీఐ నరహరి కథనం ప్రకారం.. మండల పరిధిలోని సంతాపూర్ గ్రామానికి చెందిన గుండేటి నర్సింహ కేశంపేటలోని శారద గార్డెన్స్‌లో జరుగుతున్న ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. అతని బ్రాస్‌లెట్ తప్పిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఫంక్షన్ హాల్‌లో సీసీ కెమెరాల ఆధారంగా విచారణను వేగవంతం చేసి బ్రాస్‌లెట్‌ను రికవరీ చేసి బాధితుడికి అందజేశారు. రూ.2లక్షల విలువైన బ్రాస్‌లెట్ అప్పగించడంతో నర్సింహ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేసును కొలిక్కి తీసుకొచ్చిన కానిస్టేబుల్ అశోక్‌రెడ్డిని సీఐ నరహరి, ఎస్సై రాజ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## చలివేంద్రం ప్రారంభం

వనస్థలిపురం, ఏప్రిల్ 8: వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ అన్నారు. శ్రీనివాస టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఎన్‌జీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, మజ్జిగ కేంద్రాన్ని మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడం మన సంస్కృతిలో భాగమన్నారు. ఎండల్లో ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు. వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణేశ్ టెంపుల్ వైస్ చైర్మన్ మిట్టా రామ్మోహన్, ప్రముఖ న్యాయవాది రమణ, వనస్థలిపురం సీఐ శ్రీనివాస్‌రావు, ట్రావెల్స్ సంస్థ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నందిగామ, ఏప్రిల్ 8 : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నందిగామ బైపాస్ రోడ్డుపై సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. జడ్చర్ల పట్టణానికి చెందిన తుపాకుల ఆంజనేయులు(48) షాద్‌నగర్ ప్రాంతంతో ప్లాస్టిక్ డబ్బాలు, కవర్లు సేకరించి అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి నందిగామ బైపాస్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా చాకలిగుట్ట తండా పరిధిలోని నాయర పెట్రోల్ పంపు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. గమనించిన స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. రెండు గంటలైనా అంబులెన్స్ రాకపోవడంతో చేసేది ఏమి లేక పోలీసులు ఓ ప్రైవేటు డీసీఎంలో షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అంబులెన్స్ సమయానికి రాకపోవడంతోనే ఆం జనేయులు మృతి చెందాడని స్థానికులు ఆరోపించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుండె పోటుతో కార్మికుడి మృతి

నందిగామ, ఏప్రిల్ 8 : గుండె పోటుతో కార్మికుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వెంకటేశ్వర హ్యాచరీస్ పరిశ్రమలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. నారాయణపేట జిల్లా ఊట్కూరు గ్రామానికి చెందిన రమేశ్ బాబు (58) అప్పారెడ్డిగూడ గ్రామ శివారులోని వెంకటేశ్వర హ్యాచరీస్ పరిశ్రమలో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం రాత్రి గుండె పోటు రావడంతో ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అప్పటికే రమేశ్ బాబు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాడ్గుల, ఏప్రిల్ 8 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని సీఐ వేణుగోపాల్ రావు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అందుగుల వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. గ్రామానికి చెందిన కొప్పుల శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ఘనంగా చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న పురోహితులు

మొయినాబాద్, ఏప్రిల్ 8: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. గరుత్మంతుడి పటాన్ని పల్లకీలో ప్రతిష్ఠించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం గరుడ పటానికి నాలుగు దిక్కుల గరుత్మంతుడి రూపాలు ప్రతిష్ఠించి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాలను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి ఆర్చకులు రంగరాజన్, నరసింహన్, మురళీ, కిట్టు, కృష్ణమూర్తి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు నోటీసుల అందజేత

కేశంపేట, ఏప్రిల్ 8: ప్రభుత్వ స్థలంలో డబ్బాలను ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారం సాగిస్తున్నవారికి రెవెన్యూ అధికారులు మంగళవారం నోటీసులు అందజేసినట్లు ఆర్ఐ నివేధిత తెలిపారు. మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో 9మంది డబ్బాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారం సాగించేవారని, ఇటీవల కాలంలో ఓ వ్యక్తి చిన్నపాటి డబ్బాను నూతనంగా ఏర్పాటు చేసుకోవడంతో ప్రభుత్వ స్థలం కబ్జా అవుతుందని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ విషయమై గ్రామానికి వెళ్లి 10మంది చిరు వ్యాపారులకు నోటీసులు అందజేసినట్లు వివరించారు. నోటీసులు అందిన మూడు రోజుల్లో తగిన సమాధానం ఇవ్వాలని, కాదని మొండిగా వ్యవహరిస్తే ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించాల్సి వస్తుందని హెచ్చరించారు.



చిరు వ్యాపారుల డబ్బాలకు నోటీసులు అతికిస్తున్న రెవెన్యూ సిబ్బంది

## అంగన్‌వాడీలో పోషణ్ పక్వాడా

కందుకూరు, ఏప్రిల్ 8: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాలు అందించాలని మహేశ్వరం డివిజన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శాంతి శ్రీ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల నుంచి రెండేండ్ల వయసు వచ్చేవరకు పోషకాహారలోపం లేకుండా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పిల్లల్లో ఉబస కాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యవంతమైన జీవనశైలి కలిగి ఉండాలన్నారు. ఆరోగ్యవంతంగా ఉండటం కోసం సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గర్భిణులకు బరువు, ఎత్తులు చూశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిర, అంగన్వాడీ టీచర్ గోవిందమ్మ బాలింతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శాంతి శ్రీ

## మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా నేతలు

మన్సురాబాద్, ఏప్రిల్ 8: నాగోల్ డివిజన్ పరిధి సాయి నగర్ కాలనీలోని ధర్మభిక్షం భవన్‌లో మంగళవారం భారత జాతీయ మహిళా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ సమావేశాన్ని నిర్వహించి సాయి నగర్ కాలనీ భారత జాతీయ మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎండీ ఫైమీద, సభ్యులుగా సహేద బేగం, ధనమ్మ, పద్మ, అచ్చాలి, కమిలి, ప్రమీల హేమలత, అంజమ్మ, బాలమని, పద్మ, నిర్మలమ్మ, విజయలక్ష్మి, చిన్నమ్మ, మనెమ్మ, హేమలత, లక్ష్మి, లావణ్య, షమీం, పల్లవి, అరుణ, సాయమ్మ, సరోజ నియమితులయ్యారు. కమిటీ సభ్యురాలు సహేదాభిగం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి మహిళా సమాఖ్య సీనియర్ నాయకులు ప్రేమ పావని, గ్రేటర్ హైదరాబాద్ సీపీఐ పార్టీ కార్యదర్శి ఛాయాదేవి హాజరై మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలో అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరిగిపోయాయన్నారు. నాగాలాండ్ లో జరిగిన ఘటనలు చాలా దుర్మార్గమని సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకునేలా ఉన్నాయన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినా ఎన్ని ప్రభుత్వాలు మారినా మహిళల బతుకులు మారలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ ఫైమీద, గ్రేటర్ హైదరాబాద్ మహిళా స మాఖ్య అధ్యక్షురాలు నళిని హాజరయ్యారు.